"చాలా ఆశ్చర్యంగా వుంది నాకు. కానీ ఆ జాబ్ ఏమిటో....నా మీద మీకుండే హక్కులేమిటో చెప్తారా?"

"జాబ్ సంగతి తర్వాత! ముందు మాక్కావలసింది అంగీకారం. తరువాత ఈ ఉద్యోగం. అనుమానాలూ, ప్రశ్నలు లేకుండా మేం చెప్పింది చేయటం. అలా అని చెప్పి చట్టానికి వ్యతిరేకంగా గానీ , ప్రమాదకరమైన పనులుగానీ చేయించం. ఏదోటి త్వరగా నిర్ణయించుకుని చెప్పాలి"

చకచకా ఆలోచించాడతను తనలో. పది లక్షల రూపాయల పని ఏం చేయించుకుంటారు వాళ్ళు? తను అలాంటి అసాధారణమైన పనులేం చేయగలడాని?
ఏదయినాగానీ పది లక్షలు....తను మరో జన్మ ఎత్తినా సంపాదించలేని మొత్తం......పది లక్షలు సంపాదిస్తే లైఫ్ ఎలా మారిపోతుంది!

తులసిని ఎన్ని విధాలయిన సుఖాల్లో ముంచి తేల్చవచ్చు. కానీ పది లక్షలు నిజంగా యిస్తారా? అతని వైపు మరోసారి చూశాడు సురేష్. ఖరీదయిన డ్రస్ .......గోల్డ్‌రింగ్ .....గోల్డ్ సిగరెట్ కేస్....అతని రూపం అతనికది చాలా తేలిక అన్పిస్తోంది.

"నేనేంచేయాలో చెప్పండి!"

అతను కొద్ది క్షణాలు తనవంకే సూటిగా చూడటం గమనించాడు సురేష్ . అలా చూడటం ఆందోళన కలిగిస్తోంది తనకు.

"అయితే ప్రశ్నలూ అనుమానాలూ లేకుండా నీ అంగీకారం తెలపవన్నమాట. మనం ముందిది తేల్చుకోవటం చాలా ముఖ్యం " అతని గొంతు రాన్రాను భయంకరంగా మారుతున్నట్లుంది. బెదిరింపు అస్పష్టంగా కనబడుతోంది.

సురేష్‌కి చెమటలు పడుతున్నాయి. ఇందులో ఏదో పన్నాగం వుంది. చట్టానికి వ్యతిరేకం, ప్రమాదకరమయినవి ఏమీ చేయించరంట.......మరలాంటిదేమీ లేకుండా పది లక్షలు ఉహూ? గుడ్డిగా ఆశపడితే .......తరువాత విచారించాల్సి రావచ్చు.

"సారీ! ముందు అన్నీ వివరంగా తెలుసుకుంటేగానీ మీ వుద్యోగానికి వప్పుకోలేను " అతని ముఖంలో క్షణం పాటు కోపం కన్పించి మాయమయింది.

"నువ్వున్న పరిస్థితుల్లో కళ్ళు మూసుకుని ఈ ఆఫర్ వప్పుకుంటావనుకున్నాను"

సురేష్ ఆశ్చర్యపోయాడు. తనున్న పరిస్థితి అతనికెలా తెలుసు? "అలా అనుకుంటే మీరు పొరపడ్డారు" అన్నాడు సురేష్ .

"పూర్తి వివరాలు చెప్పటం కుదరదుగానీ కొంతవరకూ చెప్తాను"అన్నాడతను సిగరెట్ వెలిగించుకుని.

సురేష్ ఊపిరి బిగపట్టాడు.

“ఈ ఉద్యోగం ఆరు నెలలుంటుంది. నువ్వో అందమైన భవనంలో వుంటావు. ఐశ్వర్యంలో మునిగి తేలుతావు! ఆ తర్వాత నీ దారి నీదే ...మా దారి మాదే. మళ్ళీ ఎప్పుడూ మనం కలుసుకోం. ఒప్పుకుంటే ఇప్పుడే లక్ష రూపాయలు మీ తులసి బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేస్తాం. మిగతాది మన కాంట్రాక్ట్ పూర్తయ్యాక. ఇప్పుడు త్వరగా నిర్ణయించుకుని చెప్పు. నువ్వు కాదంటే నీలాంటి వాళ్ళు లక్షమంది దొరుకుతారు మాకు” సురేష్‌కి భయం వేసింది.

తను ఇప్పుడున్న పరిస్థితిలో ఈ అవకాశం మరొకరికి యిచ్చే తెలివితక్కువ పని చేయడు. ముందు లక్ష రూపాయలు......అవునూ తన తులసి పేరూ, ఆమె పేర బ్యాంక్ ఎకౌంట్ వున్న విషయం ఇతనికెలా తెలిసింది? ఏమో అది అప్రస్తుతం.

లక్ష రూపాయలే కళ్ళముందు కనబడుతున్నాయ్. నిజంగా ప్రమాదకరం కాదు. చట్టానికి వ్యతిరేకం కాదు. ఈ రెండు కానప్పుడు ఎందుకు భయపడటం? ఈ రెండింటిలో ఏది ఎదురొచ్చినా తను ఖచ్చితంగా ఉద్యోగం నిరాకరించి వచ్చేయవచ్చు.

“ఆల్‌రైట్ ఎగ్రీడ్” అన్నాడు సురేష్ . అతనికి తెలీకుండానే గొంతు వణికింది.

కాళ్ళూ చేతూలూ ఐస్‌లాగా అయిపోయాయి. గొంతు తడారిపోయింది.

ఆ వ్యక్తి పెదాలమీద చిరునవ్వు వెలిసింది భయంకరంగా.

“మొట్టమొదటి షరతు- నువ్విక్కడ జరిగిన విషయాలుగానీ, నీకు మేం చెప్పిన ఉద్యోగం గురించి గానీ ఎవరికి తెలీనీకూడదు. కంప్లీట్ సీక్రెట్! ఆఖరికి మీ తులసి కి కూడా........”

మరోసారి భయం నరాల్లోనుంచి పాకింది. “వద్దు వద్దు వద్దు ” అని ఎవరో చెవిలో ఘోషిస్తున్న శబ్దాలు. త్వరగా మళ్ళీ కూడదీసుకున్నాడు సురేష్ .

“ఒప్పుకుంటున్నాను ఎగ్రీడ్. మీరెలా చెపితే అలా” అన్నాడతను.

ఈసారి గొంతు వణకలేదు.

సహదేవ్ సురేష్ భజం తట్టాడు.

“గుడ్. దట్ షుడ్ బి ది స్పిరిట్! ” అన్నాడు తల పంకిస్తూ. అతని పెదాల మీది సన్నని నవ్వు, కొలిమిలో కాలుతున్న సన్నని ఇనుప పట్టీని గుర్తుకుతెస్తోంది.

“రేపే లక్ష రూపాయలు మీ తులసి ఎకౌంట్‌లో క్రెడిట్ చేస్తాం”

అతని గుండె మళ్ళీ వేగంగా కొట్టుకోసాగింది. నమ్మాలో నమ్మకూడదో తెలీటం లేదు.

ఆ తరువాత ఏం జరగబోతోందో తెలీటం లేదు. తను ఆరునెలలపాటు వాళ్ళేం చెప్పితే అది చేయాలి. సంథింగ్ డేంజరస్. ఇల్లీగల్. ఆరు నెలల తర్వాత తనకు పూర్తి స్వాతంత్రం. ప్లస్

మిగతా తొమ్మిది లక్షలు క్యాష్. ఆ తరువాత ఏం భోగం అనుభవించబోతున్నాడు తను?

“డు యూ స్మోక్ మిస్టర్ సురేష్?” సిగరెట్ ఆఫర్ చేస్తూ అడిగాడతను. అదే మామూలుగా అయితే తను నిరాకరించేవాడు. కానీ ఇప్పుడు తీసుకోవాలనిపిస్తోంది. సిగరెట్ అందుకున్నాడు.

“థాంక్యూ”

“వెల్కమ్ ఫ్రెండ్ ! వెల్ కమ్.”

ఇంచుమించుగా అగ్రిమెంట్ అయిపోయినట్లే. నో గోయింగ్ బాక్ నౌ. లోలోపల అశాంతి పెరిగిపోతోంది. అతనిలో ఏదో ఓ అంశం ప్రమాదకరంగా కనబడుతోంది. ఖచ్చితంగా ఇది అని తెలీటం లేదు. అయినా తనకు డబ్బు కావాలి. తన డార్లింగ్ తన ప్రాణం తులసి తన వల్ల ఎలాంటి కష్టాలు పడకూడదు.

“ఇంకేమయినా మాట్లాడాలా మిస్టర్ సహదేవ్?” అడిగాడు అతను అసహనంగా.

“ప్రస్తుతానికింతే. మిగతా విషయాలన్నీ ఉద్యోగం మొదలయ్యాక.”

“ఎప్పటినుంచి చేరాలి?”

“ఎనీటైమ్ సురేష్, ఇవాల్టినుంచి ఏ రోజయినా, ఏ క్షణాన్నయినా నీ అవసరం కలగవచ్చు. అవసరం కలిగిన వెంటనే నిన్ను పిలిపించుకుంటాం”

“మరి మా ఇల్లు....”

మాట పూర్తవకుండానే అతను నవ్వాడు. “మాకు తెల్సు..... మాక్కావలసిన వాళ్ళను ప్రపంచంలో ఏ మూల వున్నా తేలిగ్గా కలుసుకుంటాం .....”

సురేష్ లేచి నిలబడ్డాడు.

“ఆఖరిసారి వార్నింగిస్తున్నాను సురేష్! పది లక్షలు చిన్న మొత్తం కాదని నీకూ తెలుసు. మనం మాట్లాడుకున్న మాటల గురించి గానీ, ఉద్యోగం గురించి కానీ ఇంకెవరికీ తెలీకూడదు. మీ తులసికి రాజ్యలక్ష్మికీ కూడా”

“ఎందుకని?” ఆశ్చర్యంగా అడిగాడతను.

“అది వాళ్ళకే ప్రమాదం గనుక......”

“మరి నేను ఆరు నెలలపాటు మీ దగ్గర వుంటే......”

“ఇంకో కారణం ఏదయినా చెప్పు సురేష్! నువ్వు చాలామంచి కథలల్లి చెప్పగలవు కదా?”

సురేష్ గుండె ఝల్లుమంది. ఎలా తెలుసు తన గురించి అతనికి? రాజ్యలక్ష్మి చెప్పిందా? రాజ్యలక్ష్మికి మాత్రం ఎలా తెలుసు? నటాషా ద్వారానా?

అతను కరచాలనం చేయటానికి చేయి జాపాడు.

సురేష్‌కి అతని చేయి పెద్దబోనులా అనిపిస్తోంది "యూకెన్ స్టార్ట్ ఎంజాయింగ్ యువర్ లైఫ్ సురేష్! మేము పిలిచేవరకూ"

సురేష్ హోటల్ బయటికొచ్చేశాడు.

తులసి కరాటే ప్రాక్టీస్ చేస్తోంది. గాల్లోకి ఎగురుతూ కాళ్ళూ చేతులూ కత్తుల్లా ఊపుతూ "ఎనీ లక్" అడిగింది ఒగరుస్తూనే.

"ఎస్! సమ్! లక్"

అమాంతం ఆమెను కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నాడతను.

"కరాటే కూడా స్టిమ్యులేటర్‌గా పని చేస్తుందన్నమాట" అన్నాడు మరింత చొరవ తీసుకుంటూ.

అతని చేతుల్ని తోసివేయడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది తులసి. "నేనడిగిందానికి సరిగ్గా జవాబు చెప్పవేం?" ఆయాసంతో ప్రతి ఘటన ఆపేసిందామె.

"ఫర్లేదు పెనుగులాడు. అలాగే బావుంది" అన్నాడతను నవ్వుతూ.

అతని గుండెలకు పూర్తిగా హత్తుకుపోయిందామె.

"ఒండర్‌ఫుల్ ఆఫర్ డియర్! ఉద్యోగం దొరికింది. కానీ ఇక్కడ కాదు మద్రాసులో."

"మద్రాసులో ఏం పని?"

"సినిమా హీరోయిన్ దగ్గర నైట్ వాచ్ మన్"

తులసి పగలబడి నవ్వేస్తోంది.

"ప్రస్తుతానికివే సంగతులు. వివరాలు వచ్చే సంచికలో. కానీ నువ్వు ఇక్కడే వుండాలి. ఇద్దరం అక్కడికెళ్ళటం కుదరదు"

"ఎందుకు"

"వివరాలు వచ్చే సంచికలో అన్నాను కదా!"

"ఇహ నువ్వు లేకుండా నేనెలా వుండను"

"అంతవరకూ మహేష్తో మానేజ్ చేసుకో!"

అతని డొక్కలో గట్టిగా పొడిచిందామె.

"అమ్మో!" నొప్పితో అరచాడు సురేష్.

"ఇంకెప్పుడూ పిచ్చి మాటలు మాట్లాడకు మరి" కోపంగా అంది.

"పతియే ప్రత్యక్ష దైవం స్కీమా నీది?" అడిగాడతను.

"నిజంగా మద్రాస్ వెళ్ళాలా?"

ఏదొక అబద్ధం ఆడకపోతే లాభం లేదు. తను కూడా వచ్చేస్తానంటుంది.

"మద్రాస్ అంటే మద్రాస్ కాదు. అక్కడి నుంచి ఎక్కడికో మళ్ళీ ...... దుబాయ్,

ఇరాక్......"

"ఓ గల్ఫ్ జాబ్....."

"ఎస్ ! గల్ఫ్ జాబ్......"

తులసికి అబద్ధం చెప్పటం తనకి ఇష్టం వుండదు. ఏదో ఘోరమయిన తప్పు చేస్తున్న ఫీలింగ్ కాల్చేస్తుంటుంది.

"చాలా డబ్బు దొరుకుతుంది కదూ?"

"రేపే నీ అకౌంట్లో లక్ష రూపాయలుంటుంది చూడు......."

తులసి నిరాశపడింది " జోక్స్ వద్దని చెప్పానా"

"రేపే తెలుస్తుంది కదా........"

ఆమెతో సహా హఠాత్తుగా నేలమీదకు ఒరిగాడతను.

"వదులు......" ఆమె జట్టంతా విడిపోయి ఇద్దరి ముఖాలనూ కప్పేస్తోంది.

"ఇటీజ్ టూ లేట్ ........." చీకట్లోంచే అన్నాడు.

"అది మగాడి డ్యూటి.....ఆడకూతురి డ్యూటీల్లాగా....కార్యేషుమంత్రీ, శయనేషు రంబా అన్నట్లు మగాడు కూడా కార్యేషు రాజా శయనేషు డెవిల్......." కొద్ది నిమిషాల తర్వాత ఆమె నుదుటిమీద స్వేదబిందువులను నాలుకతో తుడిచాడతను.

"సురేష్ నువ్వు నన్నొదిలి ఎక్కడికి పోవు కదూ?"

"డోంట్ సిల్లీ. మనం రెండు రకాల ఆకలితో చచ్చిపోతాం."

"చెరోచోట వుండడం కంటే అదే మంచిది" మొండిగా అందామె.

"తులసీ! ఈ జాబ్ కొద్దిరోజులే. తరువాత హెవెన్. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఇలాగే హాపీగా"

"ఇష్టం లేదని చెప్పాక యింక ఆ విషయం మాట్లాడవద్దు" పెదాలు బిగించింది చిరుకోపంతో

"తులసీ! ఆడపిల్లలిలా మొండి కేస్తే చాలా అసహ్యంగా వుంటుంది"

"నువ్వెన్నయినా చెప్పు ! నేను వినను"

ఆమెను దూరంగా తోసివేశాడు.

"అయితే నిన్ను వదిలేస్తాను ఈ క్షణం నుంచీ మనం ఒకరికొకరు ఏమీకాము"

"నీలాంటి ఇడియట్‌తో కాపురం చేయటం నాకూ యిష్టం లేదు"

"నీలాంటి దానితో ఇంతకాలం కలసి వున్నందుకు నరకం అనుభవించాను"

"ఏం నేనేం బాధలు పెట్టాను నిన్ను?" ఉక్రోషంగా, రోషంగా అడిగింది.

"ఒకటేమిటి? అన్నిటికి తలనొప్పే. నా కిష్టమయిన భంగిమలు వద్దంటావ్, దానిక్కూడా

టైమూ తిథీ నక్షత్రం అంటావ్. వన్ బై టూ వద్దంటావ్. కాలీ ఫ్లవర్, కారెట్ కలిపి వండటం చేతకాదు. ఐ డోంట్ లైక్ డార్క్‌డెవిల్ అంటావు."

తలుపు దగ్గర చప్పుడయింది.

ఒక్క వుదుటున లేచి పెద్ద అంగలతో దూకి తలుపు తెరచాడతను.

తలుపుకి చెవి ఆన్చి నిలబడి వుంది గంగా భవాని. కొద్దిక్షణాల బ్రహ్మాండమయిన నిశ్శబ్దం ఆవరించింది ముగ్గురి మధ్యా. తులసి యధాప్రకారం వంటింట్లోకి పరుగెత్తింది. వెంటనే కోలుకుంది గంగాభవాని.

"ఇల్లు ఖాళీ చేసే విషయం కనుక్కుందామని వచ్చాను" అంది తడబడుతూ.

"మా మాటలన్నీ మాట్లాడుతున్నారు....తప్పు నాదెలా అవుతుంది"

"అయినా యాభయ్ రూపాయలు కట్ అవుతాయి. రెండు తెలుగు సినిమాల్లో వుండేన్ని సెక్స్ డైలాగ్‌లు విన్నందుకు"

ఆమె టాపిక్ మార్చింది "తులసి అంత పనికిరానిదయితే నువ్వు వుద్యోగం లేకుండా ఎందుకు ప్రాక్టీస్ చేస్తున్నట్లో"

"పొరుగువాళ్ళ కోపరేషన్ లేకపోవటం వల్ల."

ఆమె ముఖం ఎర్రబడినది. కళ్ళు మారినాయి. తులసి బయటికొచ్చింది. జట్టు ముడివేసుకుంటూ.

"ఇలాంటి మనిషినెందుకు అంటి పెట్టుకుని వున్నారో తెలీటం లేదు" తులసి తో అందామె.

"ఓసారి అంటుకుంటే మీరూ అంతే" అన్నాడు సురేష్.

తులసి కొద్ది క్షణాలు నవ్వకుండా వుండటానికి విఫలయత్నం చేసింది.

"ఇల్లు సంగతి......."

"మీరు షాక్ తిననంటే మీకు అద్భుతమయిన వార్త చెప్పబోతున్నాను" ఆమె మాటకు అడ్డుపడుతూ అన్నాడు.

"ఏమిటది?"

"జ్యోతిష్యం నిజమయే రోజొచ్చేసింది"